వాయిస్ ఆఫ్ Voice of Vande Bharath
వందే భారత్
VOICE OF VANDE BHARATH
శుక్రవారం, సెప్టెంబర్ 11, 2026

# ఐక్యంగా ఉందాం.. అన్ని సాధించుకుందాం

- పవర్ ఆఫ్ ప్రింట్ మీడియా ఆత్మీయ వేదిక నిర్ణయం



**ములుగు, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** జిల్లా కేంద్రంలోని ప్రింట్ మీడియా పాత్రికేయులంతా ఐక్యంగా ఉండి, తమ సమస్యల పరిష్కారం కోసం సమష్టిగా పోరాడాలని 'పవర్ ఆఫ్ ప్రింట్ మీడియా' ఆత్మీయ వేదిక నిర్ణయించింది. జిల్లా కేంద్రానికి సమీపంలోని గట్టమ్మ దేవాలయం వద్ద శుక్రవారం భేతి సతీష్ అధ్యక్షతన ప్రింట్ మీడియా ఆత్మీయ వేదిక సమావేశం నిర్వహించారు. గత కొంతకాలంగా జిల్లా వ్యాప్తంగా ప్రింట్ మీడియా పాత్రికేయులను ఒకే వేదికపైకి తీసుకువచ్చేందుకు చేస్తున్న ప్రయత్నాలకు సార్థకత చేకూరిందని సమావేశంలో పలువురు అభిప్రాయపడ్డారు. ఏర్పడిన ఐక్యతను భవిష్యత్తులోనూ కొనసాగిస్తూ పాత్రికేయుల సమస్యల పరిష్కారానికి సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.



### పాత్రికేయుల కోసం పొదుపు సంఘం..

పాత్రికేయులు ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులను అధిగమించేందుకు సమావేశంలో కీలక నిర్ణయం తీసుకున్నారు. సభ్యులందరి భాగస్వామ్యంతో పొదుపు సంఘాన్ని ఏర్పాటు చేసి, ప్రతి నెలా నిర్ణీత మొత్తాన్ని క్రమం తప్పకుండా పొదుపు చేసేలా ప్రణాళిక రూపొందించారు. భవిష్యత్తులో సభ్యులకు ఆర్థికంగా అండగా నిలిచేలా ఈ పొదుపు సంఘాన్ని కొనసాగించాలని నిర్ణయించారు. అదేవిధంగా రాజకీయ పార్టీల నాయకులు, అధికారులు నిర్వహించే మీడియా సమావేశాల్లో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై సమావేశంలో చర్చించారు. ప్రెస్‌మీట్ల నిర్వహణలో ప్రింట్ మీడియా ప్రతినిధులకు ప్రత్యేక సమయం కేటాయించేలా చర్యలు తీసుకోవాలని అభిప్రాయపడ్డారు. ఈ సమావేశంలో పాత్రికేయులు సుంకర సంపత్, గుర్రపు శ్రీధర్, కె. రాజిరెడ్డి, గూడూరు మహిపాల్‌రెడ్డి, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా 'సంఘమిత్ర'

- ఘనంగా కార్యక్రమం ప్రారంభం..

**హనుమకొండ, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** మత్తు పదార్థాల మహమ్మారిని తరిమికొట్టే లక్ష్యంతో పోలీస్ శాఖ మరియు ప్రజల భాగస్వామ్యంతో హన్మకొండలో 'సంఘమిత్ర' కార్యక్రమం శుక్రవారం కాళోజీ కళాక్షేత్రంలో ఘనంగా ప్రారంభమైంది. డ్రగ్స్, గంజాయి వినియోగం వల్ల కలిగే అనర్థాలపై యువత, మహిళలు మరియు ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు ఈ వేదికను వేదికగా మలిచారు. స్వయం సహాయక సంఘాలు, మెప్మా రిసోర్స్ పర్సన్లు, ఆఫీస్ బేరర్ల భాగస్వామ్యంతో జిల్లాలోని 1.60 లక్షల మంది సభ్యులకు ఈ డ్రగ్స్ వ్యతిరేక సందేశాన్ని ప్రతి ఇంటికి, ప్రతి గడపకూ చేరవేయడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశం. ఈ కార్యక్రమంలో భాగంగా వివిధ గ్రూపులకు చెందిన 1,000 మంది సభ్యులు ప్రాతినిధ్యం వహించగా.. వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, హన్మకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. "రిసోర్స్ పర్సన్లు, మెప్మా గ్రూపు సభ్యులు తలచుకుంటే గంజాయి నిర్మూలన సాధ్యమవుతుంది. ప్రతి గ్రామంలో, ప్రతి కుటుంబంలో డ్రగ్స్ వ్యతిరేక అవగాహన కల్పించడంలో మహిళా సంఘాల సభ్యులు కీలక పాత్ర పోషించాలి. ప్రతి తల్లి తన బిడ్డ భవిష్యత్తు గురించి ఆలోచించి, వారి ప్రవర్తనలో మార్పులను గమనించాలి. డ్రగ్స్ విక్రయం లేదా సరఫరాకు సంబంధించిన సమాచారం తెలిస్తే ఎలాంటి భయం లేకుండా పోలీసులకు తెలపండి; సమాచారం అందించిన వారి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచి తగిన రివార్డు అందజేస్తాం. డ్రగ్స్‌కు బానిసైన వారిని దూరం చేయకుండా కౌన్సెలింగ్, వైద్య సహాయం అందించి సాధారణ జీవితంలోకి తీసుకురావాలి. డ్రగ్స్‌కు 'NO' చెప్పండి – జీవితానికి 'YES' చెప్పండి" అని పిలుపునిచ్చారు. గతంలో డ్రగ్స్‌కు బానిసై, ఆ వ్యసనం నుంచి బయటపడిన వ్యక్తి తన అనుభవాలను పంచుకుంటూ.. "డ్రగ్స్ కొన్ని గంటల మత్తును ఇస్తే, కుటుంబానికి ఎన్నో రోజుల కన్నీళ్లను ఇస్తాయి" అని యువతను హెచ్చరించారు. ట్రైబల్ వెల్ఫేర్ కళాశాల విద్యార్థినులు ప్రదర్శించిన డ్రగ్స్ అవేర్‌నెస్ స్కిట్ అందరినీ ఆకట్టుకుంది. ముఖ్యమంత్రి, డీజీపీ, తెలంగాణ నార్కోటిక్స్ బ్యూరో డైరెక్టర్ల వీడియో సందేశాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రోహిత్ నేత, జిల్లా ఇన్‌ఛార్జి అదనపు కలెక్టర్ శేషాద్రి, డీఆర్‌డీఏ మేనేజర్ శ్రీను, మెప్మా పీడీ రాజేశ్వర్, ఏసీపీలు నర్సింహా రావు, ప్రశాంత్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు, ఇన్‌స్పెక్టర్లు, ఎస్సైలు మరియు భారీ సంఖ్యలో మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.




# నూతన క్రిమినల్ చట్టాలపై అవగాహన సదస్సు



**మామునూరు, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** వరంగల్ మామునూరు 4వ బెటాలియన్ ప్రాంగణంలో పోలీసు అధికారులు, సిబ్బందికి నూతన క్రిమినల్ చట్టాలపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. బెటాలియన్ కమాండెంట్ ఎన్.వి. సత్య శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఐ సత్యనారాయణ, ఎస్ఐ రాధిక నూతన చట్టాల్లోని ముఖ్యమైన అంశాలను సిబ్బందికి వివరించారు. 2024 జూలై 1 నుంచి దేశవ్యాప్తంగా అమల్లోకి వచ్చిన భారతీయ న్యాయ సంహిత–2023, భారతీయ నాగరిక సురక్షా సంహిత–2023, భారతీయ సాక్ష్య అధినియమం–2023 చట్టాలపై అవగాహన కల్పించారు. పాత ఐపీసీ స్థానంలో అమల్లోకి వచ్చిన BNSలో నేరాలు, శిక్షలకు సంబంధించిన నిబంధనలు, పాత సీఆర్‌పీసీ స్థానంలో వచ్చిన BNSSలో క్రిమినల్ ప్రొసీజర్, పాత ఎవిడెన్స్ యాక్ట్ స్థానంలో వచ్చిన BSAలో సాక్ష్యాధారాలకు సంబంధించిన నిబంధనలను సిబ్బందికి వివరించారు. శాంతిభద్రతల పరిరక్షణలో ప్రతి పోలీసు అధికారి, సిబ్బంది నూతన చట్టాలపై పూర్తి అవగాహన, పట్టు సాధించాలని కమాండెంట్ సత్య శ్రీనివాసరావు సూచించారు. కేవలం నేరస్థులకు శిక్ష విధించడమే కాకుండా, బాధితుడిని కేంద్రంగా చేసుకుని వేగవంతంగా న్యాయం అందించడమే నూతన చట్టాల ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన న్యాయ వ్యవస్థను అందుబాటులోకి తీసుకురావడమే ఈ చట్టాల ఉద్దేశమని తెలిపారు. కార్యక్రమంలో బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ రాజేందర్, ఆర్ఐలు కార్తీక్, రవి, సర్వర్, రాజ్‌కుమార్, కృష్ణ, ఆర్ఎస్ఐలు, బెటాలియన్ సిబ్బంది పాల్గొన్నారు.

# తల్లి, బిడ్డ ఆరోగ్యమే లక్ష్యం

### ఘనంగా జిల్లా స్థాయి 'పోషణ్ మేళా' వేడుకలు




**హనుమకొండ, వాయిస్ ఆఫ్ వందేభారత్ :** మాతా శిశు మరణాలను నివారించడంతో పాటు ఆరోగ్యవంతమైన తెలంగాణ సాధనలో భాగంగా ప్రభుత్వం 'పోషణ్ మాసం' కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని కుడా చైర్‌పర్సన్ గుండు సుధారాణి అన్నారు. స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 'పోషణ్ మాసః 2026' కార్యక్రమంలో భాగంగా జిల్లా స్థాయి 'పోషణ్ మేళా'ను శుక్రవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. పోషకాహార లోపాన్ని నివారించి, ఆరోగ్యవంతమైన సమాజాన్ని స్థాపించడమే ఈ కార్యక్రమ ప్రధాన లక్ష్యం. ఈ కార్యక్రమానికి కుడా చైర్‌పర్సన్ గుండు సుధారాణి, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రవి, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) శేషాద్రి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కుడా చైర్‌పర్సన్ గుండు సుధారాణి మాట్లాడుతూ.. పోషణ అన్నది కేవలం ఆహారం ఇవ్వడం మాత్రమే కాదని, అది భావి తరాలను ఆరోగ్యంగా తీర్చిదిద్దే బృహత్తర ప్రక్రియ అని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ మాట్లాడుతూ.. 'పోషణ మాసం' కార్యక్రమాలను జిల్లాలో అన్ని శాఖల సమన్వయంతో విజయవంతం చేయాలని ఆదేశించారు.వేడుకల్లో భాగంగా కుడా చైర్‌పర్సన్, కలెక్టర్ గర్భిణులకు సంప్రదాయబద్ధంగా 'సీమంతం' నిర్వహించి సారె అందజేశారు. అలాగే 7 నెలలు నిండిన చిన్నారులకు పౌష్టికాహారంతో 'అన్నప్రాశన' జరిపించారు. వేడుకల్లో ఏర్పాటు చేసిన ఆహార ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. వివిధ రకాల ఆహార సమూహాలతో 'ఫుడ్ పిరమిడ్'ను ప్రదర్శించి వాటి పోషక విలువలను వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి విశ్వజ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి, డీఆర్డీఓ, డీవైఎస్ఓ, ఆయుష్ డీపీఎం, సీడీపీఓలు, పోషణ్ అభియాన్ టీమ్, అంగన్‌వాడీ టీచర్లు, లబ్ధిదారులు పాల్గొన్నారు.